# 100. అల్ ఆదియాత్ (పరుగెత్తే గుర్రాలు) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 11 ఆయతులు ఉన్నాయి. అల్లాహ్ పట్ల మనిషి కృతఘ్నుతను, ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహాన్ని ఈ సూరా ప్రస్తావించింది. ఈ సూరాకు పెట్టిన పేరు మొదటి ఆయతులో ప్రస్తావనకు వచ్చింది. ఈ సూరా యుద్ధ రంగంలో విశ్వాసులు ఉపయోగించే గుర్రాలకు సంబంధించిన వర్ణనతో ప్రారంభమయ్యింది. ప్రజలు తమ సంపద పట్ల, ప్రాపంచిక భోగభాగ్యాల పట్ల ఎలా వ్యామోహం పెంచుకుంటారో వివరించింది. అల్లాహ్ పట్ల ఎలా కృతఘ్నులు అవుతారో తెలిపింది. తీర్పుదినాన ప్రతి ఒక్కరి కర్మల చిట్టా అతని ముందు ఉంటుందని, ప్రతి ఒక్కరి రహస్యాలు బట్టబయలవుతాయని తెలియజేసింది.

## 100. అల్ ఆదియాత్ సూరా

سُوْرَةُ الْعٰدِيٰتِ

అవతరణ : మక్కా ఆయతులు : 11

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** రొప్పుతూ, రివ్వున దూసుకుపోయే గుర్రాల సాక్షిగా![1]

وَالْعٰدِيٰتِ ضَبْحًا ﴿١﴾

**2** మరి డెక్కల రాపిడితో నిప్పు రవ్వలను చెరిగేవాటి సాక్షిగా![2]

فَالْمُوْرِيٰتِ قَدْحًا ﴿٢﴾

**3** మరి ప్రభాత సమయాన (ప్రత్యర్థులపై) మెరుపుదాడి చేసేవాటి సాక్షిగా![3]

فَالْمُغِيْرٰتِ صُبْحًا ﴿٣﴾

**4** మరి ఆ సమయంలో అవి దుమ్ము ధూళిని రేపుతాయి.[4]

فَاَثَرْنَ بِهٖ نَقْعًا ﴿٤﴾

1. **'ఆదియాత్'** ( **العٰدِيٰت** ) అంటే చాలా వేగంగా పరుగెత్తే గుఱ్ఱాలని అర్థం. **'జబ్‌హున్'** ( **ضَبْحًا** ) అంటే వగర్చటం, రొప్పటం అని ఒక అర్థం. సకిలించటం అని మరో అర్థం. అంటే రొప్పుతూ లేక ఆవేశంతో సకిలిస్తూ రణరంగంలో శత్రు సేనల వైపు దూసుకుపోయే గుర్రాలని భావం.

2. ఆ విధంగా అవి పరుగెత్తుతూ పోతున్నప్పుడు వాటి డెక్కల రాపిడికి నిప్పు కూడా పుడుతుంది. ముఖ్యంగా అవి పర్వత కనుమల మీదుగా పోతున్నప్పుడు, రాతి ప్రదేశాలలో తమ ఖురములను నేలకు కొడుతూ పోతున్నప్పుడు ఈ దృశ్యం కనిపిస్తుంది. అటువంటి అశ్వాల మీద ప్రమాణం చేసి రానున్న వాక్యాలలో ఒక ముఖ్య విషయం చెప్పబడుతోంది.

3. **'ముగీరాత్'** ( **مُغِيْرٰت** ) అంటే ఆకస్మిక దాడి జరిపేవి అని అర్థం. పూర్వం అరేబియాలో సాధారణంగా ఉదయం పూటే యుద్ధం మొదలయ్యేది. రాత్రిపూట అందరూ ఆదమరిచి నిద్రపోతుండగా శత్రు శిబిరాలపై విరుచుకుపడటం పిరికితనానికి నిదర్శనమని, శూరులైన వారెవరూ అలాంటి వెన్నుపోటుకు పాల్పడరని వారు భావించేవారు.

4. అంటే – ఆ గుర్రాలు వేగంగా దూసుకుపోతున్నప్పుడు, శత్రుశిబిరంపై ఆకస్మిక దాడులు జరిపినప్పుడు ఆ ప్రాంతమంతా దుమ్ముధూళితో నిండిపోతుంది.

**5** మరి దాంతోపాటు (శత్రు) సైనిక పంక్తుల మధ్యలోకి చొచ్చుకుపోతాయి.[5]

فَوَسَطْنَ بِهٖ جَمْعًا ۙ﴿۵﴾

**6** అసలు విషయం ఏమిటంటే మానవుడు తన ప్రభువు (విషయంలో) చేసిన మేలును మరచినవాడుగా తయారయ్యాడు.[6]

اِنَّ الْاِنْسَانَ لِرَبِّهٖ لَكَنُوْدٌ ۚ﴿۶﴾

**7** నిజానికి ఈ విషయానికి స్వయంగా అతనే సాక్షి![7]

وَاِنَّهٗ عَلٰى ذٰلِكَ لَشَهِيْدٌ ۚ﴿۷﴾

**8** యదార్థానికి అతను ధనప్రేమలో మహా ఘటికుడు.[8]

وَاِنَّهٗ لِحُبِّ الْخَيْرِ لَشَدِيْدٌ ۗ﴿۸﴾

**9** ఏమిటి, సమాధుల్లోని వాటిని బయటికి కక్కించబడే సమయం గురించి అతనికి తెలియదా?[9]

اَفَلَا يَعْلَمُ اِذَا بُعْثِرَ مَا فِى الْقُبُوْرِ ۙ﴿۹﴾

**10** గుండెల్లోని గుట్టంతా రట్టు చేయబడే సమయం గురించి[10] (అతనికి తెలీదా?)

وَحُصِّلَ مَا فِى الصُّدُوْرِ ۙ﴿۱۰﴾

5. **'వసత్న'** (وَسَطْنَ)అంటే మధ్యలోకి అని అర్థం. తాము రేపిన దుమ్ముతో ఆ ప్రదేశమంతా కలుషితమై, ఏమీ కానరాని పరిస్థితి ఏర్పడినప్పుడు ఆ గుర్రాలు అకస్మాత్తుగా శత్రువుల శ్రేణులలోకి చొచ్చుకుపోయి కలకలాన్ని సృష్టిస్తాయి.

6. మొదటి ఐదు ఆయతులలో చేయబడిన ప్రమాణాలకు సమాధానం ఈ (6వ) ఆయతులో ఇవ్వబడింది. ఇక్కడ 'మానవుడు' అంటే సత్య తిరస్కారి, దైవధిక్కారి అయినవాడు అన్నమాట! మేలును మరచిన వారే ఇలా తయారవుతారు.

7. అంటే – మనిషి తన ప్రవర్తన ద్వారా, మాటల ద్వారా తాను దేవుని కృతఘ్నుణ్ణి అని ఖుద్దుగా నిరూపించుకుంటున్నాడు.

8. ఇక్కడ **'ఖైర్'** అనే అరబీ పదం ధనం, డబ్బు, సిరిసంపదలు అన్న అర్థంలో ప్రయోగించ బడింది. ఉదాహరణకు: అల్ బఖరా సూరాలోని 180వ వచనంలో **"ఇన్ తరకల్ ఖైరా...."** ను చూడండి. అక్కడ ఆ పదం ఆస్తిపాస్తులు, సిరిసంపదలు అన్న అర్థంలోనే ఉంది. **'షదీద్'** అంటే 'చాలా గట్టివాడు' అని అసలు అర్థం. అయితే ధనాశ కలవాడు, పిసినారి అని కూడా చెప్పవచ్చు. సాధారణంగా సంపద వ్యామోహంలో చిక్కుకు పోయినవాడే పిసినిగొట్టుగా, పేరాశాపరునిగా తయారవుతాడు.

| | |
|---|---|
| **11** నిశ్చయంగా ఆ రోజు వారి ప్రభువుకు వారి గురించి బాగా తెలిసి ఉంటుంది.[11] | اِنَّ رَبَّهُمۡ بِهِمۡ يَوۡمَئِذٍ لَّخَبِيۡرٌ ؓ﴿١١﴾ |

9. అంటే – సమాధులలో ఉన్న మృతులంతా బ్రతికించబడి, లేపబడే సమయం....

10. అంటే – హృదయాలలో దాగివున్న రహస్య విషయాలన్నీ బయటపెట్టబడిన వేళ.

11. మృతులను సమాధుల నుంచి సజీవంగా లేపిన పరమప్రభువు, వారి ఆంతర్యాల్లోని రహస్య విషయాలను వెళ్ళగ్రక్కించే దేవుడు ఎంతటి సూక్ష్మద్రష్టయో ఊహించవచ్చు. ఆయన నుండి ఏ వస్తువూ దాగిలేదు. మరి ఆయన ప్రతి ఒక్కరికీ వారి కర్మలనుబట్టి పుణ్యఫలమో, పాపఫలమో ఇస్తాడు. దైవానుగ్రహాలను అనుక్షణం ఆస్వాదిస్తూ దేవుని మేళ్లను మరచి విర్రవీగే వారికి ఇదొక హెచ్చరిక! అలాగే ధనవ్యామోహంలో పడిపోయి తమ సంపదలో నుంచి హక్కుదారుల హక్కు చెల్లించ కుండా ఉండే పిసినారులకు కూడా ఇది హెచ్చరికే!